క్లుప్తంగా

స్టీల్ కుర్చీల వితరణ



నెల్లూరు(అర్బన్) : సుమారు రూ.1.50 లక్షల విలువైన 66 స్టీల్ కుర్చీలను లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు వారు నగరంలోని పెద్దాస్పత్రికి మంగళవారం వితరణ చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ పాల్గొని, వాటిని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు సేవలు ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గౌతమ్, పీడీజీలు అమృతవల్లి, శ్రీనివాసులు, రామానుజం, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్స్ ప్రసాద్, శ్రీరాములు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని మద్రాసు బస్టాండ్ కూరగాయల మార్కెట్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని డీసీఓ గుర్రప్ప మంగళవారం ప్రారంభించారు. జిల్లా సహకార ఉద్యోగులు, రిటైర్డ్ ఉగ్యోగుల వినియోగదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో విజయ డెయిరీ సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. డెయిరీ ఎండీ కృష్ణమోహన్, సంఘం జిల్లా అధ్యక్షుడు మునిప్రసాద్ పాల్గొన్నారు.

వేదగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి, ఈఓ గోపి, ఉభయకర్తలు పాల్గొన్నారు.

స్థలాలు కేటాయించాలని వినతి

నెల్లూరు(అర్బన్) : ఉద్యోగులు ఇళ్లు నిర్మించుకునేందుకు నెల్లూరులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు జిల్లా నాన్ గెజిటెడ్ ప్రభుత్వ అధికారుల హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంచలరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులైనప్పటికీ వేలాది మందికి సొంత ఇళ్లు లేవన్నారు. వీరిలో ఎక్కువ మంది చిరుద్యోగులున్నారన్నారు. సొసైటీ కార్యదర్శి చిన అంకయ్య, ఎన్జీఓ జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్ నందిమండలం ఆంజనేయ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పట్టణాల్లో తృప్తి క్యాంటీన్లు



నెల్లూరు(బారకాసు) : జిల్లాలోని అన్ని పట్టణాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులచే తృప్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసే విధంగా తగిన చర్యలు చేపట్టాలని మెప్మా పీడీ రాధమ్మ అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలోని జిల్లా సమైఖ్య సమావేశాన్ని మంగళవారం ఆమె నిర్వహించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురం లంగర్‌తోట సచివాలయ సిబ్బందికి వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్ బోర్డు మిత్ర మండలి అధ్యక్షుడు ప్రసాద్, జక్కావుల్లా, గుమ్మడి శీనయ్య, మాధవ్, సచివాలయ అడ్మిన్ వీరారెడ్డి పాల్గొన్నారు.

మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలి



నిరసన చేస్తున్న ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని కోరుతూ భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా), అఖిల భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డీవైఎఫ్ఐ)ల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న వరుస హత్యలకు మద్యం, గంజాయి, వైట్‌నర్, సొల్యూషన్ లాంటివే ప్రధాన కారణమన్నారు. వీటిని అరికట్టడంలో పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో గతంలో కంటే 800 మద్యం దుకాణాలను అదనంగా పెంచి రూ.99కే అమ్మకాలు సాగిస్తుండంతో నేరాలు పెరిగిపోయాయన్నారు. రమణ, అన్నపూర్ణమ్మ, శివకుమారి, పద్మ, సుబ్బమ్మ, వరలక్ష్మి, శంషాద్, ప్రమీల, లక్ష్మమ్మ, సంపూర్ణమ్మ, జగదీష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాలువల్లో చెత్త పేరుకుపోతోంది. దీంతో పలు ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కాగా నగరంలోని ప్రధాన కూడలి అయిన కరెంటాఫీస్ సెంటర్ మెయిన్ రోడ్డులో మురుగునీరు ఏరులై పారుతోంది. ఫలితంగా ఇక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గం గుండా వెళ్లాలంటే వాహనదారులు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజుల తరబడి ఇక్కడి కాలువ నిండి మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో కాలువల్లో సిల్ట్ తీసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

• ప్రధాన రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు



కరెంటాఫీస్ సెంటర్ ప్రాంతంలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు



కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో పొంగుతున్న మురుగు

బాబు స్కీములన్నీ స్కాములే

• కుట్టు మెషీన్ల శిక్షణ పేరుతో రూ.154 కోట్లకు స్కెచ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు (పొగతోట) : 'చంద్రబాబు ప్రవేశపెట్టిన స్కీములన్నీ స్కాములే, ఏ పథకం చూసినా అవినీతి మయమే' అని వైఎస్సార్‌సీపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మందల వెంకటశేషయ్య, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ ఆరోపించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మంగళవారం మీడియాతో మాట్లాడారు. మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం భారీ అవినీతికి తెరలేపిందన్నారు. కుట్టు మెషీన్లు అందించే పేరుతో చేపట్టిన స్కీమ్‌లో దాదాపు రూ.154 కోట్లకుపైగా దండుకోవడానికి సిద్ధమైందని తెలిపారు. మహిళల శిక్షణ కోసం రూ.221.08 కోట్లు కేటాయించారని, ఇందులో కుట్టు మెషీన్‌కు రూ.4300, ఒక్కో మహిళకు శిక్షణ కోసం రూ.3 వేలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ఈ విధంగా మొత్తం అయ్యే ఖర్చు రూ.75.06 కోట్లే అని, మిగిలిన రూ.154 కోట్లకు మాత్రం లెక్క లేదని తెలిపారు.

అడ్వాన్స్ పేరుతో రూ.25 కోట్లు

శిక్షణ పేరుతో 50 రోజుల్లోనే మొత్తం బిల్లులు కింద లాగేసేందుకు పథకం రూపొందించారని వారు దుయ్యబట్టారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ కింద రూ.25 కోట్లను కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు రంగం సిద్ధమవుతోందని, ప్రభుత్వ ఖజానాను దోచుకోవడానికి బీసీ మహిళలను పావులుగా వాడుకుంటున్నారన్నారు. నిబంధనల ప్రకారం 45 రోజులకు దాదాపు 360 గంటల శిక్షణ ఇవ్వాల్సి ఉంటే, కేవలం 135 గంటలు మాత్రమే శిక్షణ ఇస్తున్నారని, అందులో కూడా ట్రైనింగ్ కిట్ ఇవ్వడం లేదన్నారు. అంతేకాకుండా పేరున్న శిక్షణ సంస్థలను కాదని ఆంధ్రప్రదేశ్ బీసీ సహకార ఆర్థిక సంస్థ ద్వారా స్కీమ్‌ను చేపట్టి భారీ స్కామ్‌కు మార్గం సుగమం చేసుకున్నారన్నారు. టెండర్ల ప్రక్రియలోనూ ప్రి బిడ్‌లో మొత్తం 65 కంపెనీలు పాల్గొంటే 56 సంస్థలను ముందే తిరస్కరించారన్నారు. వారికి అనుకూలంగా ప్రక్రియను చేపట్టారన్నారు. వైఎస్ జగన్ హయాంలో మహిళలను తలెత్తుకుని జీవించేలా పథకాలను రూపొందించినట్లు గుర్తుచేశారు. ఈబీసీ నేస్తం, జగనన్న చేయూత, ఆసరా, అమ్మఒడి పథకాల ద్వారా మహిళలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచారని, కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలను అడ్డం పెట్టుకుని భారీ దోపిడీకి పాల్పడుతోందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి శ్యామ్‌సింగ్, జిల్లా అధికార ప్రతినిధి నెల్లూరు శివప్రసాద్, డివిజన్ ఇన్‌చార్జిలు మహేష్ యాదవ్, మాబాషా, పార్టీ నేత అలీ పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల మెరుగునకు కృషి

నెల్లూరు(బారకాసు) : నగర పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, అట్టలు, ఇతర నిరుపయోగ వస్తువులను సేకరించి, మార్కెట్లో విక్రయించి జీవనం సాగించే వృత్తిదారుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ నందన్ తెలియజేశారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులతో స్థానిక బోడిగాడితోట డంపింగ్ యార్డ్ ప్రాంగణంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నమస్తే పథకం ద్వారా చెత్త సేకరణ వృత్తిదారులు, వారి కుటుంబసభ్యులకు ఐదు లక్షల విలువైన ఉచిత వైద్యసేవలు పొందే ఆయుష్మాన్ కార్డులు, స్వచ్ఛత ఉద్యమి యోజన ద్వారా రుణాలు అందించనున్నామని తెలిపారు. ఆరోగ్య శాఖాధికారి చైతన్య ఇన్‌చార్జిగా, శానిటేషన్ సూపర్‌వైజర్ నరసింహరావు నోడల్ అధికారిగా, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శుల బృందంతో పాటు నవజీవన ఆర్గనైజేషన్ సభ్యులు నగర పరిధిలో చెత్త సేకరణ వృత్తిదారులను గుర్తించారని తెలిపారు. సమావేశంలో ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్ సాయికృష్ణ, సహదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న కమిషనర్ నందన్, పక్కనే మేయర్ స్రవంతి, హాజరైన కార్పొరేటర్లు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని ప్రజాప్రతినిధుల సహకారంతో స్థానిక సమస్యలకు పరిష్కారాన్ని అందిస్తామని కమిషనర్ నందన్ తెలియజేశారు. ఎన్ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మేయర్ స్రవంతి, కార్పొరేటర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు వారి డివిజన్ల పరిధిలో పలు సమస్యలను మేయర్, కమిషనర్‌తో చర్చించారు. ప్రజా ప్రతినిధులు సూచించిన అన్ని అంశాలను నమోదు చేసుకుని అవసరమైన చర్యలను వెంటనే తీసుకుంటామని మేయర్, కమిషనర్ సమాధానం ఇచ్చారు. కార్పొరేటర్లు వేలూరు మహేష్, కర్తం ప్రతాప్‌రెడ్డి, ఓబిలి రవిచంద్ర, కరిముల్లా, మొగళ్లపల్లి కామాక్షిదేవి, సఫియా బేగం, గుంజి జయలక్ష్మి, నీలి రాఘవరావు, ఇంజినీరింగ్ ఎస్ఈ రామ్మోహన్‌రావు, సెక్రటరీ శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ పద్మజ పాల్గొన్నారు.

• రెవెన్యూ వసూళ్లకు ప్రాధాన్యం కల్పించండి

రెవెన్యూ వసూళ్లకు అత్యంత ప్రాధాన్యం కల్పించాలని కమిషనర్ నందన్ రెవెన్యూ అధికారులు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. రెవెన్యూ విభాగ వారాంతపు సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. దీర్ఘకాల పన్నుల బకాయిలపై దృష్టి సారించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో వైద్యవిద్యార్థి రుబాబు

• ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో వైరల్

నెల్లూరు(అర్బన్) : ఓ పీజీ వైద్య విద్యార్థి పెద్దాస్పత్రిలో రుబాబు చేస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసి స్పెషలిస్టు వైద్యం నేర్చుకునేందుకు ఒక డాక్టర్ పీజీ సీటు సాధించారు. ఆయన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చేరి కనీసం నాలుగు నెలలు కూడా కాలేదు. అంతలోనే కోర్సు చేస్తున్న విద్యార్థులపై చేయిచేసుకున్నాడు. ఈ విషయమై వైద్యశాఖ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది. దీంతో సదరు విద్యార్థికి పెద్దాస్పత్రి డాక్టర్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇది జరిగిన రెండో నెలల్లోనే ఆస్పత్రిలో తనకు సంబంధించిన విషయాలు తల్లిదండ్రులకు చేరవేస్తున్నాడని అనుమానించి ఓ జూనియర్ డాక్టర్‌ను ఓపీలోనే కాలర్ పట్టుకుని బయటకు లాక్కొచ్చాడు. దీంతో సదరు విద్యార్థిని హాస్టల్ నుంచి బయటకు పంపించారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం శనివారం మరో ఘటన చోటుచేసుకుంది. డ్యూటీలో లేకున్నా ఓ పేషెంట్ అటెండర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో మరో జూనియర్ డాక్టర్ ఆ పీజీ డాక్టర్‌ను పక్కకు తీసుకెళ్లాడు. ఈవిషయాన్ని పేషెంట్ అటెండర్ వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఇప్పుడు అది వైరల్ అవుతోంది. ఇలాంటివి జరగకుండా చూడాల్సిన బాధ్యత పెద్దాస్పత్రి సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌పై ఉందని పలువురు డాక్టర్లు, రోగులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందును వివరణ కోరగా రెగ్యులర్ ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

దౌర్జన్యంగా తొలగిస్తే ఉద్యమిస్తాం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వందేళ్ల నుంచి నివాసం ఉంటున్న ఇళ్లను దౌర్జన్యంగా తొలగిస్తామంటే ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని 52వ డివిజన్ రైల్వేవీధి, బర్మాషెల్‌గుంట ప్రాంతాల్లో మంగళవారం సీపీఎం నాయకులు పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించకుండా ఇళ్లు తొలగించకూడదని స్పష్టం చేశారు. నాయకులు నాగేశ్వరరావు, రషీద్, చిరంజీవి, అమాన్, శ్రీనివాసులు, అలీ, అఖిల్, గణేష్ పాల్గొన్నారు.

హౌసింగ్ నిబంధనలతో నష్టం

నెల్లూరురూరల్ : హౌసింగ్ కార్పొరేషన్ నిబంధనలు చట్టాల పరిధిలో లేవని, లబ్ధిదారుని ఖాతాలో జమ అయిన నగదును ఇవ్వడం లేదని, నిబంధనలు మార్పు చేయకుంటే నష్టం తప్పదని బీజేపీ నేత మిడతల రమేష్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతల వల్లే బీజేపీ కాంట్రాక్టర్‌కు ఎక్కువ నష్టం జరుగుతోందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆదిశంకరాచార్యుల సంస్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరంలో బుధవారం నుంచి 13వ తేదీ వరకు జగద్గురు ఆదిశంకరాచార్యుల సంస్మరణోత్సవాలు చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా జరుగనున్నాయని మందిర మేనేజర్ సీవీఎల్ నరసింహం మంగళవారం తెలిపారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో ఆస్తమాకు చెక్


నెల్లూరు(అర్బన్) : ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆస్తమా రాకుండా చేయవచ్చని మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రి సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సుష్మితారెడ్డి తెలిపారు. ప్రపంచ ఆస్తమా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఆస్తమాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుందన్నారు. సకాలంలో డాక్టర్‌ను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలన్నారు. మెడికవర్ ఆస్పత్రిలో ఆస్తమాకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, పల్మనాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది, పీఆర్వో చందువర్మ పాల్గొన్నారు.

ఇన్‌హేలర్ చికిత్సతో..



నెల్లూరు(అర్బన్) : ఇన్‌హేలర్ చికిత్సతో ఆస్తమాను నియంత్రించవచ్చని ఊపిరితిత్తుల డాక్టర్ ప్రేమ్‌దీప్ అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీఎంపీ), బిలీవ్ స్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జ్యోతినగర్‌లోని రాఘవయ్య చికిత్సాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆస్తమాపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఇన్‌హేలర్ చికిత్సలను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, సత్తార్, నాయకులు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, శ్రీధర్, రామరాఘవయ్య, జాకీర్, నిస్సార్, పట్టాభిరామిరెడ్డి, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): తమ ప్రాంతానికి తాగునీరు అందించాలంటూ సీపీఎం నాయకులతో కలిసి సుందరయ్య కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. నగరంలోని 23, 24 డివిజన్లలో కుళాయిల ద్వారా తాగునీరు రావడం లేదని స్థానిక సచివాయం వద్ద నిరసన చేపట్టారు. సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సెక్రటరీ సురేష్ మాట్లాడుతూ, సుందరయ్యకాలనీ, సీడీ బ్లాక్, జాషువా నగర్, అంబేడ్కర్ నగర్ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. నాయకులు శ్రీనివాసులు, సుబ్బారావు, మల్లికార్జున, వెంకమ్మ, హబీబ్ పాల్గొన్నారు.

నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్) : నవాబుపేట ఇన్‌స్పెక్టర్‌గా జి.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా, ఆత్మకూరు సీఐగా, ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నాయుడుపేట సీఐగా పనిచేశారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట) : జిల్లాలో తాగునీటి స్కీములకు మరమ్మతులు చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులను ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. సీపీడబ్ల్యూఎస్ పనులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

శేషజీవితం హాయిగా గడపాలి



ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సిబ్బందితో ఎస్పీ, ఏఎస్పీ

నెల్లూరు(క్రైమ్) : ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది శేషజీవితం కుటుంబంతో హాయిగా గడపాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆకాంక్షించారు. సీసీఎస్ ఎస్సై వెంకటాద్రినాయుడు, ఉలవపాడు ఏఎస్సై ఖాదర్‌వలీ, ముత్తుకూరు హెచ్‌సీ టి.భాస్కర్, నార్త్‌ట్రాఫిక్ హెచ్‌సీ దేవసేన, బాలాజీ నగర్ ఏఎస్సై వై.వెంకటేశ్వర్లు, ఏఆర్ఎస్సై శంకరయ్య, ఏఎస్‌పేట హెచ్‌సీ కె.ప్రసాద్‌లు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో మంగళవారం వారిని ఎస్పీ సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ సుదీర్ఘకాలం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఏఓ చంద్రమౌళి, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, వెల్ఫేర్, హోమ్‌గార్డు ఆర్ఐలు రాజారావు, పోల్‌రాజు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, మాజీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరి, సిబ్బంది, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



ఆదిశేషారెడ్డితో మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని పాత వెల్లంటి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేమిరెడ్డి ఆదిశేషారెడ్డిని పార్టీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆదిశేషారెడ్డి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న క్రమంలో ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నేతలు గంపల వెంకటరమణయ్య, పాదర్తి సుధాకర్, గోపాలయ్య, బాబురావు, రాపూర్ అంజయ్య, బండి బుజ్జయ్య, చెట్టుమూరు శ్రీధర్‌రెడ్డి, కుండ మస్తాన్‌రెడ్డి, పి.వెంకటేష్, గుడి ఆనంద్ పాల్గొన్నారు.

• కొత్త వెల్లంటి గ్రామంలో బిజ్జం మల్లికార్జున్‌రెడ్డి తల్లి మస్తానమ్మ ఇటీవల మృతిచెందింది. ఈ క్రమంలో మంగళవారం ఆమె చిన్న కర్మ కార్యక్రమంలో ఆనం విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, లీలామోహన్‌రెడ్డి, సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా ఆరోపించారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జనార్దన్‌రెడ్డికాలనీ, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో కొందరు యువకులు మద్యం, గంజాయి మత్తులో దోపిడీలు, దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద సోమవారం రాత్రి వాసుదేవరెడ్డి అనే లారీ డ్రైవర్‌ను ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్ బెదిరించి రూ.500 వసూలు చేశారని, అంతేకాకుండా కులంపై అవహేళనగా మాట్లాడడం దారుణమని అన్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యాధుల నివారణకు కృషి

నెల్లూరు(అర్బన్) : కీటకజనిత వ్యాధుల నివారణకు వైద్యసిబ్బంది కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు తెలిపారు. చంద్రమౌళినగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రం, ఎన్టీటీ కాలనీ ఆరోగ్య కేంద్రాల్లో జరుగుతున్న ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెంగీ, మలేరియా లాంటి అనుమానిత కేసులున్న ప్రాంతాల్లో ఎక్కువగా రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



నెల్లూరు(బారకాసు) : ఆప్కాస్ ఉద్యోగులను నిలిపివేయడం సరికాదని సీఐటీయూ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన ధర్నాను మంగళవారం కూడా కొనసాగించారు. అనంతరం మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్మికుల పరిస్థితి తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారిని కోరారు. నాయకులు మాలకొండయ్య, సుధాకర్, ఎం అశోక్, మట్టిపాటి శ్రీనివాసులు, సుజాతమ్మ, మారుతీ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల దహనం

నెల్లూరురూరల్: పాకిస్థాన్ తీవ్రవాదుల దిష్టిబొమ్మను నగరంలోని కోటమిట్ట మహాలక్ష్మమ్మ గుడి ప్రాంతంలో బీజేపీ నాయకులు దగ్ధం చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.